క్లుప్తంగా

'బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం'


తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సూర్యప్రకాశ్

దేవరుప్పుల : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాలల పరిరక్షణ శాఖ జిల్లా అధికారి సూర్యప్రకాశ్ అన్నారు. పడమటితండా జీపీ పరిధి దోనెబండాతండాలో ఓ బాలికకు ఆదివారం(నేడు) వివాహం చేసేందుకు సన్నద్ధమవుతుండగా.. సమాచారం మేరకు శనివారం బాలల పరిరక్షణ అధికారులు చేరుకుని నిలిపివేశారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను చైల్డ్‌కేర్ హాస్టల్‌లో చేర్పించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ బాలికలతో వివాహం నిశ్చయం చేసుకున్న యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను సీఐ దామోదర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. సే నో టు డ్రగ్స్–సే నో టు బెట్టింగ్ నినాదంతో యువత చెడు మార్గంలో వెళ్లకూడదనే ఉద్దేశంతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజన్‌బాబు, నరేష్, రాధిక పాల్గొన్నారు.

ఆహ్వానం



దేవరుప్పుల: మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తా సమీపంలో రేపు (సోమవారం) రాజ్యాంగకర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కోసం దేవరుప్పుల దళిత కమిటీ శనివారం పలువురికి ఆహ్వానం పలికారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పల్ల భార్గవి, మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి, సామాజిక సేవానాయకులు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ తదితరులకు ఆహ్వానం పత్రిక అందజేసి స్వాగతించారు. తీగల దయాకర్, చింత రవి , లొడంగి వెంకటేశ్వర్లు, భిక్షపతి, అబ్బయ్య, సోమనర్సయ్య ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి




బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఎంపీడీఓ వెంకట మల్లికార్జున్‌తో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సెకండరీ పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



జనగామ రూరల్: అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో సాయంత్రం నిర్వహించనున్న జ్ఞానయాత్రను జయప్రదం చేయాలని మహనీయుల ఉత్సవాల కమిటీ గౌరవ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్, అధ్యక్షుడు నందు వెంకట్‌స్వామి కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జ్ఞానయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. డాక్టర్లు సీహెచ్ రాజమౌళి, పి.సుగుణాకర్ రాజు, గొల్లపల్లి కృష్ణ, గిరిమల్లె రాజు మల్లిగారి రాజు,కందుకూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర వాసికి ఎంబీబీఎస్ పట్టా



పాలకుర్తి: బమ్మెర గ్రామానికి చెందిన బొంకూరి మంజుల–యాకయ్య దంపతుల కుమారుడు అనిల్ వైద్య విద్యను పూర్తి చేసి ఎంబీబీఎస్ పట్టాను అందుకున్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ వైద్య కళాశాలలో ప్రొఫెసర్ల చేతుల మీదుగా పట్టా పొందారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తల్లిదండ్రులు అనిల్‌ను అభినందించారు.

పేదోడి ఫ్రిజ్ 'కుండ'


అమ్మకానికి సిద్ధంగా ఉన్న కుండలు, రంజన్లు


కుండలను కొనుగోలు చేస్తున్న మహిళలు

● పెరిగిన వినియోగం

జనగామ: మండుతున్న ఎండలు.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గొంతు తడారి పోతోంది. దాహం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ చల్లని తాగునీటి కోసం తహతహలాడి పోతున్నారు. రిఫ్రిజిరేటర్ ద్వారా తయారయ్యే కూల్ వాటర్‌తో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండంతో మట్టి కుండలు, రంజన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఏప్రిల్ రెండో వారంలో 38 డిగ్రీల సెల్సీఎస్ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మూడు, నాల్గో వారం వచ్చే సరికి 40 నుంచి 41 వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ భావిస్తోంది. దీంతో ఆరోగ్యకరమైన మట్టి కుండల్లో ఉపయోగించే చల్లని వాటర్ తాగేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడుతున్నారు. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు స్థానిక వ్యాపారులు ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి రంజన్లు, మట్టి కుండలను దిగుమతి చేసుకుంటున్నారు. వేసవికాలంలో మంచి గిరాకీ ఉన్న మట్టి కుండలకు ఈ సారి ధర కొంచెం ఎక్కువనే చెప్పుకోవచ్చు. చల్లని నీటిని తాగాలనే పేదోడి కోరిక మట్టికుండల ద్వారా తీర్చుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఎలాక్ట్రానిక్ పరికరాల కంటే, మట్టికుండల్లోని నీటిని తాగడం వల్ల శ్రేయస్కరమని వైద్యులు అంటున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం


విరాళం అందించిన భక్తులతో పూజారి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి స్థానికులు పిట్టల కోమల, ఆమె కుమారులు, కోడళ్లు రాము, అక్షిత, లక్ష్మణ్, దివ్య, రాజేందర్, సంఘవి ఆధ్వర్యంలో శనివారం రూ.2.50లక్షలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా పిట్టల రాము, లక్ష్మణ్, రాజేందర్ మాట్లాడుతూ తమ తండ్రి, మాజీ విద్యుత్‌ఉద్యోగి అయిన ఐలయ్య జ్ఞాపకార్థంగా హనుమాన్ జయంతి రోజున ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి విరాళంగా అందించినట్లు తెలిపారు. హనుమాన్ దయతో అందరూ బాగుండాలని, అందులో మేముండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కలకోట రామానుజచార్యులు, భక్తులు తెల్లాకుల రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నరేందర్, విమల, కుమారస్వామి, రమాదేవి, మొగిలి, యాదలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

● సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గబ్బెట గోపాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తుందన్నారు. పార్టీ విస్తరణలో భాగంగా సీపీఐ మండల, జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. పాతూరి సుగుణమ్మ, చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి రమేశ్, బంటు పాండు, నీల కనకయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి


లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం: రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి.. ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవద్దని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సిరిపురం గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. రైతులకు మేలు జరిగే విధంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉండాలని, తూకంలో బస్తాకు 40.500 కిలోగ్రాములే కాంటా వేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్య వారం రోజుల్లో తీర్చేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. క్లౌం-జీడికల్ రోడ్డును జూన్ చివరి వరకు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో డీఆర్‌డీఓ వసంత, తహసీల్దార్ రవీందర్, ఏఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ రఘురామకృష్ణ, ఏపీఎం శంకరయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, దేవస్థాన చైర్మన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం

జనగామ రూరల్/బచ్చన్నపేట/చిల్పూరు: రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. శనివారం మండలంలో మరిగడి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బానోత్ బన్సీ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు వంగల మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్, పర్శరాములు, చామకూర చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్, కొన్నె గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, సీఈఓ కాశ బాలస్వామి పాల్గొన్నారు. చిల్పూరు మండలంలోని రాజవరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సరస్వతి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవో వినయ్‌కుమార్, నిర్వాహకులు కాల్వ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల విద్యార్థుల దాతృత్వం


మధుకర్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న విద్యార్థులు

జనగామ రూరల్: అంధుల ఆశ్రమ నిర్వహణకు పట్టణంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విరాళాలుగా సేకరించిన రూ.3.13 లక్షలను చెక్కు రూపంలో ఇట్రాయిడ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మధుకర్‌రెడ్డికి శనివారం అందజేసి తమ దాతృత్వాన్ని చాటారు. శనివారం పాఠశాల సెక్రటరీ సి.ఉపేందర్‌రెడ్డి అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రముఖ వైద్యుడు లవకుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా దృక్పథం అలవర్చుకుని కంటిచూపు లేని వారికి తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను అభినందిస్తూ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠశాల డైరెక్టర్ సి ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరబిందో పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్: పట్టణంలోని శ్రీ అరబిందో హైస్కూల్‌లో శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, కె.వాసుదేవ రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఉపేందర్ రెడ్డి, పి.స్వరూప రాణి , సఫీన, రమ్య తదితరులు పాల్గొన్నారు.

'కాషాయ జెండా ఎగరడం ఖాయం'


నర్మెట: మోదీ చిత్రపటంతో నాయకులు

నర్మెట: తెలంగాణలో కాషాయ జెడా ఎగరడం ఖాయమని, రాన్నుది బీజేపీ ప్రభుత్వమేనని పార్టీ మండల శాఖ కన్వీనర్ సాక్కం అనిల్ కుమార్ అన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర పార్టీ పిలుపు మేర గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శనివారం ఆగాపేట, ఇప్పలగడ్డ, గండిరామారంలలో శనివారం ఆరోగ్య కేంద్రాలను, అంగన్ వాడీ కేంద్రాలను, రేషన్ షాపులను సందర్శించారు. నాయకులు జహంగీర్, మెతుకు సిద్దులు, చెవుల రాజు, పెండ్లి శివ, మల్లేష్, ప్రదీప్, రాజబోయిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ కోరారు. గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మదన్‌మోహన్, గద్దం రాజు, మారపల్లి రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

జనగామ రూరల్: గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలోని దుర్గమ్మ గుడిని శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బనుక శివారాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ రూరల్: పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ సౌమ్య శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వీవర్స్ కాలనీ, గ్రెయిన్ మార్కెట్, గీతనగర్, వికాస్‌నగర్, గిర్నిగడ్డ, బాణాపురం, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

నర్మెట: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం పాదయాత్ర చేపట్టాయి. నర్మెట నుంచి హన్మంతాపూర్ వరకు సాగిన పాదయాత్రలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ఈసందర్భంగా హన్మంతాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు కాల్వ అశోక్ జెండాను ఎగురవేసి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు భూక్య జయరాం, కూకట్ల చంద్రమౌళి, ఫరీదుల యాదయ్య, దేవులపల్లి భాగ్యలక్ష్మి, గొల్లపల్లి బాలచందర్, తీగుళ్ల భూపతి రెడ్డి, నాగరాజు, కన్నెబోయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జై బాపు, జైభీమ్ జై సంవిధాన్ కార్యాక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగం రెడ్డి, పిన్నింటి కావ్యశ్రీరెడ్డి, నూకల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి

● సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ


మాట్లాడుతున్న న్యాయవాది సాదిక్ అలీ

జనగామ రూరల్: అందరివాడైన బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అందరూ పాటుపడాలని సాధిక్ పౌండేషన్ చైర్మన్, న్యాయవాది సాదిక్ అలీ కోరారు. జిల్లా కేంద్రంలోని స్కాలర్ గ్రామర్ హైస్కూల్‌లో అంబేడ్కర్ రాష్ట్ర యువజన సంఘం, సాదిక్ ఫౌండేషన్ సంయుక్తంగా అంబేడ్కర్ అందరివాడు అనే నినాదంతో బహుజన కవి సమ్మేళనం కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సాదిక్ అలీ పాల్గొని మాట్లాడారు. ప్రముఖ వైద్యులు ప్రీతి దయాల్, లగిశెట్టి ప్రభాకర్, కొలిపాక బాలయ్య, రామమూర్తి, భాస్కర్, రాజేంద్రప్రసాద్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

భూమిపూజ



చిల్పూరు: పల్లగుట్ట గ్రామంలో ఈనెల 30వ తేదీన బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం శనివారం అర్చకులు రంగాచార్యుల వేద మంత్రాల నడుమ చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠాపన పూర్తయ్యే వరకు ప్రజలు, దాతలు సహకరించాలని అన్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ కోరారు. ఈ మేరకు శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డీఎంఓ నరేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నామాల శ్రీను, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామావత్ మీట్యా నాయక్, మంగ బీరయ్య, ఐకేపీ ఇన్‌చార్జ్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ రూరల్: కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని అంబేడ్కర్ ఫొటోసాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురాములు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆళ్ల రామకృష్ణ, నాగరాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారం నమ్మొద్దు'

చిల్పూరు: అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేతుల మీదుగానే జరుగుతుందని.. కాంగ్రెస్ పార్టీ వారు చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని పార్టీ నాయకుడు లొడెం రవీందర్ అన్నారు. కొండాపూర్ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే రాజయ్యను కలువగా వెంటనే స్పందించి విగ్రహాన్ని ఇప్పించడం జరిగిందన్నారు. త్వరలో రాజయ్య చేతుల మీదుగా విగ్రహావిష్కర జరుగుతుందని, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కడియం చేతుల మీదుగా ఆవిష్కరణ చేయించేందుకు సన్నాహాలు చేస్తుండటం సరికాదన్నారు. గాలి ప్రవీణ్, అనీల్, గూళ్ల ప్రకాష్, పోచయ్య, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వారకల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా స్వామివారికి వార కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, హనుమకొండకు చెందిన మండల సహోదర్‌రెడ్డి–మానిక, తోట కిరణ్–కీర్తిలు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా పోషణ పక్షోత్సవాలు

జఫర్‌గఢ్: మండలంలోని కోనాయిచలం, కేజీతండా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా పోషణ పక్షోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం, చేతుల శుభ్రత తదితర అంశాలపై తల్లులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, వీణారాణి, గీతారాణి, సునీత, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఇటుకాలపల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్ బి.బాలలక్ష్మి అన్నారు. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య


స్టేషన్‌ఘన్‌పూర్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాజయ్య, నాయకులు

చిల్పూరు: ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. లింగంపల్లి గ్రామంలో శనివారం పార్టీ మండల ఇన్‌చార్జ్ మాలోత్ రమేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను సభకు తరలించాలని అన్నారు. కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్, రాజన్‌బాబు, రచ్చ రవీందర్,సంగోజు రవీంద్రచారి, కంకటి ఎల్లగౌడ్, భూక్య లాలు, రావులపల్లి వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసపాలన సాగిస్తున్నారని, ప్రధానంగా రైతుల పాలిట దెయ్యంలా తయారయ్యారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో రాజయ్య ఆవిష్కరించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రైతుల పాలిట దైవంలా పనిచేస్తూ వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: భారత రాష్ట్ర సమితీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జనన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం మండలకేంద్రం అంబేడ్కర్ విగ్రహం ఎదుట రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. చిలువేరు లింగం, అంకం రాజారాం, సంజీవ, దామెర ప్రభుదాస్, రామరాజు, రాజేశ్వర్ గౌడ్,మహిపాల్,జుంలాల్‌నాయక్ పాల్గొన్నారు.

నర్మెట: రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. మండలకేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి శనివారం రజతోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించిన మాట్లాడారు. ఉమ్మడి మండలాల కీన్వనర్ పెద్ది రాజిరెడ్డి, తేజావత్ గోవర్దన్, ఎండి గౌస్, కమలాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, కంతి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్


స్టేషన్‌ఘన్‌పూర్: శోభాయాత్రలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: హిందూధర్మ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వీరహనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీచౌక్ వద్ద ప్రారంభించిన ర్యాలీని ఘన్‌పూర్, శివునిపల్లి ప్రధాన వీధుల గుండా చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వీహెచ్‌పీ, భజరంగధళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి గుట్ట చుట్ట గిరిప్రదక్షిణ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో అత్యంత పూరాతనమైన పాటిమీది అంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి గుట్ట చుట్టు హనుమాన్ స్వాములు గిరిప్రదక్షిణ నిర్వహించారు.

హనుమాన్ శోభాయాత్ర

లింగాలఘణపురం/బచ్చన్నపేట/నర్మెట: పలు గ్రామాల్లో హన్‌మాన్ జయంతి సందర్భంగా శనివారం శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల్లో భక్తిశ్రద్ధలతో కోలాటాలు ఆడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగించారు. గ్రామస్తులంతా మంగళహారతులతో స్వాగతం పలికారు.


జనగామ రూరల్: జనగామలో..


బచ్చన్నపేట: హనుమాన్ శోభాయాత్రలో భక్తులు


పాలకుర్తి టౌన్: గిరిప్రదక్షిణ చేస్తున్న స్వాములు


నర్మెటలో..